వుల్ఫ్‌గాంగ్ బోర్హెర్ట్

# 4. ఆ మంగళవారం నాడు

వారంలో ఒక్క మంగళవారం.

సంవత్సరంలో ఏభై.

యుద్ధంలో ఎన్నో మంగళవారాలు.

ఆ మంగళవారం—

వాళ్ళు బడిలో—వాక్యాలు అభ్యసిస్తున్నారు. టీచరు కళ్ళకి దళసరి అద్దాలున్నాయి. చట్రం లేని అద్దాలు.

అవి ఎంత దళసరిగా ఉన్నాయంటే, వాటివెనక ఆమె కళ్ళు అతి మెత్తగా అగుపడుతున్నాయి.

నలభై యిద్దరు ఆడపిల్లలు బ్లాక్‌బోర్డుకి ఎదురుగా కూర్చున్నారు. పెద్ద అక్షరాలతో రాస్తున్నారు:

ముసలి ఫ్రిట్జ్ చెంబు ఇత్తడితో చేసినది. లావుపాటి బెర్తా పారిస్ చేరుకోగలదు. సమరం వస్తే తండ్రులు అందరూ సైనికులే. ఉల్లా ముక్కు-కొసని నాలుకతో అందుకుంటూ రాస్తోంది. టీచరు ఒక్క-చరుపు చరచింది: ఉల్లా, సమరం - 'శ'-తో రాశావు. కుంటి 'స'-తో రాయాలి, సమాధిలోలాగ. ఎన్నిసార్లు చెప్పాను ఇదివరకు? టీచరు ఒక పుస్తకం తెరిచి, ఉల్లా పేరుకి ఎదురుగా అడ్డగీతలు పెట్టింది. ఆ వాక్యం పదిసార్లు రాసుకురావాలి రేపు నువ్వు, పెద్ద అక్షరాల్తో. తెలిసిందా? అల్లాగేనండి, అంది ఉల్లా, 'గుడ్లగూబ' అనుకుంది తనలో.

బడి ఆవరణలో తిని పారేసిన రొట్టిముక్కల్ని పొడుచుకు తింటున్నాయి కాకులు.

దళాధిపతి రమ్మంటున్నాడని కబురొచ్చింది, లూటినెంట్ ఎహ్లార్స్‌కి.

ఎహ్లార్స్‌గారూ, మెడచుట్టూ ఆ ఎర్రరుమాలు తీసెయ్యాలి.

అయ్యా ?

అవునయ్యా ఎహ్లార్స్. అటువంటివి రెండవ దళంలో ఒప్పుకోరు.

నన్ను రెండవ దళానికి మార్చారాండి ?

మరే. అందులో ఎర్రరుమాళ్లు ఎవరూ ఉపయోగించరు. అటువంటివి వేసుకుని అక్కడ నెగ్గుకురాలేవు. రెండవ దళంలో వాళ్ళు నియమాలంటే పడి చస్తారు. అసలు దళమంతా నిన్ను వెలివేసినట్టు చూస్తారు. కాప్టన్ నెస్సే అలాంటి వెప్పుడూ వేసుకోలేదు.

నెస్సే గాయపడ్డాడాండీ ?

లేదు లేదు. అస్వస్థతట, ఒంట్లో బాగా లేదన్నాట్ట. కాప్టన్ అయిన దగ్గర్నించీ కాస్త బద్ధకం ఎక్కువైంది, నెస్సేకి. కారణం తెలీదు. ఎప్పుడూ మంచి చురుగ్గా వుండేవాడు. సరే ఎహ్లార్స్, కాస్త వాళ్ళని కనిపెట్టి చూస్తుండు. నెస్సే వాళ్ళని బాగానే తరిఫీదు చేశాడు. ఆ ఎర్రరుమాలు తీసెయ్యి సరేనా ?

సరేనండి.

తరవాత సైనికులు సిగరెట్ల విషయంలో జాగ్రత్తగా ఉండేటట్టు చూడు. మిణుగురుపురుగుల్లాగ చీకట్లో ఇన్ని సిగరెట్టు కొసలు మెరుస్తుంటే, అవతలవాళ్ళకి తుపాకి మీటలు నొక్కేదాకా వేళ్ళ గుల తీరదు. కిందటి వారం అయిదు తల గాయాలు. అంచేత ఓ కంట కనిపెట్టి చూస్తుండు.

అల్లాగేనండి.

రెండోదళంలో చేరడానికి వెళ్లేముందు, లెఫ్టినెంట్ ఎహ్లార్స్ ఎర్రరుమాలు తీసేశాడు. సిగరెట్ ముట్టించాడు. ఈ దళానికి అధికారిని, ఎహ్లార్స్ నా పేరు అని చెప్పాడు.

ఒక తుపాకి మోగింది.

ఆ మంగళవారంనాడు.

శ్రీ నాన్సెన్, శ్రీమతి సెవెరిన్‌తో అన్నాడు :

సెవెరిన్, నెస్సేకి మళ్ళీ ఏదన్నా పంపిస్తే బాగుండును.

సిగరెట్లో, తినుబండారాలో. చదువుకోడాని కేదన్నా. చేతులికి గ్లోవ్స్‌గాని, ఇంకేదన్నా సరే. ఈ చలిరోజుల్లో మహాబాధ పడుతున్నారు మన యువకులు— అక్కడ. నా కదంతా బాగా అనుభవమే.

హోల్డర్లిన్ పుస్తకాలైతే—

లాభం లేదు. ఏం లాభంలేదే పిల్లా. అంతకన్నా సరదాగా ఉండేది ఏదన్నా పంపుదాం. విల్హెల్మ్‌బుష్ గాని, అలాంటి దింకేదన్నా గానీ. నెస్సేకి ఎప్పుడూ కాస్త చవకబారు పుస్తకాలే నచ్చుతాయి. నీకు తెలుసుగా, నవ్వొచ్చే వంటే మహా ఇష్టం అతనికి. అబ్బ - నా చిట్టి సెవెరిన్‌కి తెలీదూ అతనెల్లా నవ్వుతాడో—

అవును; బాగానే నవ్వుతాడు. అంది శ్రీమతి సెవరిన్.

ఆ మంగళవారంనాడు.

కాప్టెన్ నెస్సేని స్ట్రెచర్ మీద - క్రిమి నిరోధక కేంద్రంలోకి తీసుకుపోయారు.

దాని తలుపుమీద రాసి ఉంది :

సైనికు డయినా, సైన్యాధిపతి అయినా

శిరోజా లిక్కడ సమర్పించక తప్పదు.

అతని తల గొరిగేశారు. వైద్య శాఖోద్యోగి వేళ్ళు సన్నగా పొడుగ్గా వున్నాయి. సాలిపురుగు కాళ్ళలాగ కణుపుల దగ్గర కొంచెం ఎర్రగా వున్నాయి. ఆ వేళ్ళు కాప్టెన్ నెస్సేని మర్దనా చేశాయి దేనితోనో. అది మందుల దుకాణం వాసన కొట్టింది. తరవాత సాలిపురుగువేళ్ళు అతని నాడిచూసి లావాటిపుస్తకంలో రాశాయి. టెంపరేచరు-41.6, నాడి 116. మగతలో ఉన్నాడు. సన్నిపాతమని అనుమానం. ఉద్యోగి లావాటిపుస్తకం మూశాడు. పుస్తకం మీద రాసి ఉంది. స్మోలెన్స్క్ సైనిక వైద్యాలయం— అంటువ్యాధుల శాఖ. దానికింద — పద్దానుగు వందల మంచాలు—

స్ట్రెచర్ వాహకులు స్ట్రెచర్ ఎత్తారు. మెట్లు ఎక్కుతున్నప్పుడు దుప్పటీ తొలిగి అతని తల ఇవతలికి వేళ్లాడింది, ఒక్కొక్క మెట్టూ ఎక్కుతుంటే, ఇటూ అటూ దొర్లింది. బోడిగుళ్ళు. రష్యన్లను చూసి అతనెప్పుడూ నవ్వుతుండేవాడు. స్ట్రెచర్ వాహకుల్లో ఒకడికి పడిశం.

ఆ మంగళవారంనాడు.

నెస్సే సతీమణి పక్క ఇంటి తలుపు కొట్టింది. తలుపుతెరవగానే ఉత్తరం చూపించింది సంతోషంగా. ఆయన్ని కాప్టన్ చేశారు. కాప్టనూ, దళాధిపతీ కూడా. ఎప్పుడూ అక్కడ. నలభై డిగ్రీల మంచు ఉంటుంది. ఉత్తరం రావడానికి తొమ్మిది రోజులు పట్టింది. నెస్సేసతీమణికి—కాప్టన్ నెస్సే దగ్గరనుంచి, అని రాశాడుపైన.

ఉత్తరం చూపించిం దామె. ప్రక్క ఇంటామె చూడలేదు. నలభై డిగ్రీల మంచా—పాపం అంది. నలభై డిగ్రీల మంచు.

ఆ మంగళవారంనాడు.

స్మోలెన్స్క్ ...నిక అంటువ్యాధుల ఆసుపత్రి వైద్యుణ్ణి బ్రిగేడ్ వైద్యుడు అడిగాడు. ఈ వేళ ఎంతమంది?—అని.

అర డజను.

ఘోరం అన్నాడు బ్రిగేడ్ వైద్యుడు.

అవును. ఘోరమే అన్నాడు—ఆసుపత్రి వైద్యుడు.

మాట్లాడుకునేటప్పుడు వాళ్ళు ఒకరిముఖం ఒకరు చూసుకోలేదు.

ఆ మంగళవారంనాడు.

'మంత్ర వేణువు' నాటకం వేస్తున్నారు. నెస్సే సతీమణి పెదవులకు ఎర్ర రంగు పూసుకుంది.

ఆ మంగళవారంనాడు.

నర్స్ ఎలిజబెత్ తన తల్లిదండ్రులకు రాసింది : భగవంతుడే లేకపోతే, ఈ పరిస్థితుల్లో బతకడం అసంభవం. కాని జూనియర్ వైద్యాధికారి రావడంతోటే లేచినిలబడింది. అతని నడుం వొంగిపోయింది, రష్యా బరువంతా వీపుమీద ఉన్నట్టు.

అతనికి మందేవన్నా ఇమ్మన్నారా ? అని అడిగింది నర్స్.

అక్కర్లేదు, అన్నాడు వైద్యాధికారి. సన్నగా అన్నాడు, ఏదో తప్పు పని చేసినట్టు సిగ్గుపడుతూ.

తరవాత కాప్టెన్ నెస్సేని అవతలికి మోసుకుపోయారు. ధబ్బు మని చప్పుడైంది అవతల. అందర్నీ అల్లాగే పారేస్తారెప్పుడూ. చచ్చిపోయిన వాళ్ళనికాస్త మెల్లగా పడుకోబెట్టకూడదూ ? ప్రతిసారి అల్లాగే నేలమీద ధబ్బుని పారేస్తారు. అందులో ఒకడే అన్నాడా మాట. మరొకడు చల్లగా పాడాడు.

టారారం - టరరాలం—

అతి చురుకైనది కాల్బలం -

వైద్యాధికారి, ఒక మంచం తర్వాత మరో మంచం చూస్తుంటాడు — ప్రతి రోజూ. ప్రతి రాత్రీ - ప్రతి పగలూ, రాత్రంతా, పగలంతా. వంగి నడుస్తాడు. రష్యా బరువంతా వీపుమీద మోసుకు తిరుగుతుంటాడు ఆసుపత్రి అంతా. బయట ఇద్దరు స్ట్రెచర్ వాహకుల అడుగులు తడబడ్డాయి, కాళీ స్ట్రెచర్ వాళ్ళ చేతుల్లో.

నాలుగోనంబ రన్నా డొకడు. అతనికి పడిశం పట్టింది.

ఆ మంగళవారంనాడు.

ఉల్లా తన చూచిరాత పుస్తకం తెరుచుకుని కూచుంది సాయంత్రం. పెద్ద అక్షరాల్లో రాసింది.

సమరం వస్తే తండ్రులంతా సైనికులే—

సమరం వస్తే తండ్రులంతా సైనికులే—

వాక్యం పదిసార్లు రాసింది. పెద్ద అక్షరాల్లో. సమరంలో కుంటి - 'స' రాసించి, సమాధిలోలాగ.